నిప్పు.. భూసారానికి ముప్పు

- పొలాల్లో వరిదుబ్బులు, గడ్డికి నిప్పు పెడుతున్న రైతులు
- భూసారం తగ్గి పంటలకు నష్టం
- పొలాల్లో మంట పెట్టవద్దని సూచిస్తున్న అధికారులు


నిప్పు పెట్టిన వరి పొలం

పిఠాపురం: రైతులు అవగాహన లోపంతో పంటపొలాల్లో మంటలు పెడుతున్నారు. పొలాల్లో మిగిలిపోయిన గడ్డి, దుబ్బులను కాల్చి తొలగించడానికి రైతులు చేస్తున్న ప్రయత్నాలు భూసారంపై దుష్ప్రభావం చూపుతాయని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం రైతులు వరి పంటలను యంత్రాలతో కోయడం వల్ల వరిదుబ్బులు పెద్దవిగా ఉంటున్నాయి. వాటితో పాటు గడ్డి కూడా ఎక్కువ మొత్తంలో చేలల్లో ఉండిపోతోంది. వరి పంటకోతల అనంతరం ఖాళీగా ఉన్న సమయంలో పొలంలో ఉన్న వ్యర్థాలను కాల్చడం వల్ల క్రిమికీటకాలు చనిపోయి పంటలకు మేలు జరుగుతుందని రైతులు భావిస్తుంటారు. కాని అలా చేయడం వల్ల పంటకు నష్టం తప్ప లాభం ఏమీ ఉండదని వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎండలు మండిపోతుండడంతో కొందరు రైతులు తమ పొలాల్లో ఉన్న ఎండుగడ్డిని ఇతర పిచ్చి మొక్కలకు నిప్పు పెట్టి కాలుస్తున్నారు. ఇలా చేయడం చాలా ప్రమాదకరమని పొలంలో మంట పెట్టడం వల్ల మనుషులతో పాటు పొలానికి నష్టం కలుగుతుందని అధికారులు చెబుతున్నారు.

16,882 హెక్టార్లలో వరి సాగు

పిఠాపురం డివిజన్‌లో 16,882 హెక్టార్లలో వరి సాగవుతుండగా ప్రస్తుతం ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో పొలాల్లో మంట పెట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వ్యవసాయశాఖాధికారులు వివరిస్తున్నారు.

నిప్పు పెడితే నష్టాలు ఇలా...

గడ్డి దుబ్బులకు నిప్పు పెట్టడం వల్ల భూమిలో ఉండే గాలి, నీరు కోతకు గురై భూసారం తగ్గిపోతుంది. భూమిలో సారం పెంచే బ్యాక్టీరియా, ఫంగస్, సూక్ష్మజీవులు నశించిపోయి భూమి నిస్సారంగా తయారవుతుంది. దీంతో పంటల్లో అధిక దిగుబడులు సాధించడానికి వీలుకలగదు. గడ్డి దుబ్బులకు మంట పెట్టడం వల్ల గ్రీన్‌హౌస్ గ్యాస్ విడుదలై భూఉష్ణోగ్రత పెరిగి రానున్న పంటలపై ప్రభావం చూపుతుంది. వాతావరణ కాలుష్యం పెరిగి పొగమంచు ఏర్పడి పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తుంది. మంట పెట్టడం వల్ల మనుషులకు ప్రమాదకర వ్యాధులు సోకే అవకాశం ఉంది. వాతావరణంలో చేరిన కాలుష్య కారకాలు గాలి నాణ్యతను దెబ్బతీస్తాయి.

ఇలా చేస్తే అధిక దిగుబడులు

రైతులు పంట వ్యర్థాలను తొలగించడానికి రోటోవేటర్, బేలర్ వంటి పరికరాలను ఉపయోగించుకోవాలి. వీటిని ప్రభుత్వం రాయితీపై రైతులకు అందజేస్తుంది. మిగిలిపోయిన గడ్డి దుబ్బులను భూమిలో కలియదున్నడం వల్ల భూమి సారవంతంగా మారి దిగుబడులు పెరుగుతాయి. పంట వ్యర్థాలు త్వరగా కుళ్లిపోయే ప్రక్రియను వేగవంతం చేయడానికి బయో డీకంపోజర్‌ను ఉపయోగించుకోవాలి. బయోగ్యాస్ ప్లాంట్ ద్వారా పంట అవశేషాలను కాల్చడాన్ని అరికట్టవచ్చు. వేస్టు టూ ఎనర్జీ మెషీన్ ద్వారా ఈ ప్లాంట్‌లను ప్రభుత్వం అందజేస్తోంది. రైతులు వ్యవసాయశాఖాధికారులు, శాస్త్రవేత్తలు ఇచ్చే సూచనలు, సలహాలు పాటించడం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చు. వ్యవసాయ వ్యర్థాల నిర్వహణ సక్రమంగా ఉంటే నేల సారవంతవుతుంది. వాతావరణ కాలుష్యాన్ని తగ్గించుకోవచ్చు. పంటలకు నష్టం కలిగించే మంట పెట్టే విధానానికి రైతులు స్వస్తి పలకాలి.

– పి.స్వాతి, ఏడీఏ, పిఠాపురం

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



రాక్ సిరామిక్స్ గేటు రోడ్డుపై బైఠాయించిన కార్మికులు

సామర్లకోట: ఈ నెల 26వ తేదీన జేసీఎల్ జాయింట్ మీటింగ్‌లో జరగనున్న చర్చలలోపు రాక్ సిరామిక్స్‌లో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి డి.కాంత్రికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్‌లో తొలగించిన కార్మికులు ఫ్యాక్టరీ వద్ద నిర్వహిస్తున్న ఆందోళనకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ కార్మికులను తొలగించి 70 రోజులు పూర్తయినా తిరిగి విధుల్లోకి చేర్చుకోకపోవడం దారుణమన్నారు. ఫ్యాక్టరీ గేటు వద్ద కార్మికులు ఆందోళన చేస్తుంటే అధికారులు పిలిచి పోలీసులతో లాఠీచార్జీ చేయిస్తామని బెదిరించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో కార్మికులు చంద్రశేఖర్, సతీష్, రామకృష్ణ, వరప్రసాద్, మల్లికార్జునరావు, గంగాధర్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జూనియర్ కళాశాలను సద్వినియోగం చేసుకోవాలి


చంద్రమాంపల్లిలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

పెద్దాపురం: మండలంలోని చంద్రమాంపల్లి జూనియర్ కళాశాల సేవలను పరిసర గ్రామాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆజాద్ నేషనల్ ఆర్మీ అధ్యక్షులు కొత్తెం కోటి అన్నారు. మండలంలోని చంద్రమాంపల్లి హైస్కూల్ విద్యార్థులతో సోమవారం నిర్వహించిన అమ్మకు వందనం ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్ఎం గాయత్రి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి పది మంది విద్యార్థులను జూనియర్ కళాశాలలో చేర్పించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. నూతన ప్రభుత్వం తల్లికి వందనం పథకం ద్వారా పేద విద్యార్థులను ఆదుకుంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, కొమ్మిరెడ్డి బుజ్జి, తుమ్మల నాని, రేలంగి బుజ్జి, మత్తాల రాజు, ఎగ్గాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


విశేష అలంకరణలో పాదాంబిక అమ్మవారు

గొల్లప్రోలు: పట్టణంలో సోమవారం పాదాంబిక అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. గొల్లప్రోలు పట్టణంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పండితులు ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, తిరుప్పావడ సేవా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పుష్పాలతో విశేష అలంకరణ చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ మొగిలి అయ్యారావు, సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

పాయింట్‌లో మూడు ఆటోలకు మించరాదు


ఆటో యూనియన్ డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ సురేష్

సామర్లకోట: ఆటో యూనియన్ పాయింట్‌లో మూడు ఆటోలకు మించి ఉండటానికి వీలు లేదని సీఐ డి.సురేష్ ఆటో డ్రైవర్లకు స్పష్టం చేశారు. సోమవారం రాత్రి పెద్దాపురం ఆటో స్టాండ్ యూనియన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. రోడ్లపై ఆటోలు నిలుపుదల చేయడం వల్ల రోడ్లపై రాకపోకలు చేసే వారికి ఇబ్బంది కలుగుతుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని పాయింట్‌లో మూడు ఆటోలు మాత్రమే ఉండేలా చూడాలన్నారు. పెద్దాపురం పాయింట్ నుంచి ప్రతిపాడు, జగ్గంపేట, పెద్దాపురం లైన్లకు ఆటోలు వెళతాయని దాంతో గత 15 ఏళ్లుగా పాయింట్‌లో ఆరు ఆటోలు మాత్రమే ఉంచడం జరుగుతుందని యూనియన్ ప్రెసిడెంట్ సోమేశ్వరరావు తెలిపారు. మూడు ఆటోల కంటే ఎక్కువ ఉంటే చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ మూర్తి, ఎఎస్ఐ రత్నం, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నేను బడికి పోతా విజయవంతం చేయాలి


బీబీఆర్ ఎలిమెంటరీ పాఠశాల సమీపంలో గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న ఎంఈఓ

సామర్లకోట: బడి బయట పిల్లలు లేకుండా చేయడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని గొంచాల, పట్టణ పరిధిలో కరప చెరువు, బీబీఆర్ ఎలిమెంటరీ పాఠశాలల పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యాభ్యాసం పూర్తి చేసిన చిన్నారులు తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలో చేరేలా చూడాలన్నారు. ఈ మేరకు సోమవారం 40 మందిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చినట్లు ఎంఈఓ శివరామకృష్ణయ్య తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటనారాయణ

కొత్తపల్లి: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ వెంకట నారాయణ అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పారిశుధ్య కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని సూచించారు. తాగునీటి పైపులైన్లకు లీకులు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై దృష్టి పెట్టాలన్నారు. డ్రైన్లలో పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలని, రోడ్లపై చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రజలు ఈ గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఎల్‌పీఓ అన్నామణి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సంధ్య, విద్యుత్ శాఖ ఏఈ ప్రమోద్, ఈఓపీఆర్డీ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి ‘గురజాడ’ కృషి

పిఠాపురం: మహిళల జీవ ప్రమాణ స్థాయిని మెరుగు పర్చడంలో ప్రముఖ అభ్యుదయ కవి, సాహితీవేత్త, నాటక కర్త, గేయ రచయిత గురజాడ వెంకట అప్పారావు రచనలు ఎంతగానో దోహదపడ్డాయని పిఠాపురానికి చెందిన ప్రముఖ కవి, రాచకొండ నరసింహశర్మ సాహితీ సంస్థ వైస్ ప్రెసిడెంట్ కిలారి గౌరీనాయుడు అన్నారు. గురజాడ అప్పారావు ముని మనువడు గురజాడ సర్వేశ్వరప్రసాద్, గురజాడ ఇందిరాదేవి ఆహ్వానం మేరకు ఆయన సోమవారం విజయనగరంలోని గురజాడ స్వగృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాహితీ కార్యక్రమంలో గురజాడ వారసులు గౌరీనాయుడిని సభకు పరిచయం చేశారు. తొలుత గురజాడ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సెయింట్ జోసెఫ్ విద్యా సంస్థలు, విజయనగరం మహారాజా కళాశాల విద్యార్థులను ఉద్దేశించి గౌరీనాయుడు ప్రసంగించారు. గురజాడ అప్పారావు సాహిత్య రచనల ప్రత్యేకతను, కన్యాశుల్కం నాటకం ద్వారా సమాజంలో తీసుకువచ్చిన చైతన్యాన్ని ఆయన విద్యార్థులకు వివరించారు. అభ్యుదయ కవి, సాహితీవేత్త, నాటక కర్త, గేయ రచయితగా సాహిత్య, సంగీత, సాంస్కృతిక కళారంగాల్లో విశేష కృషి చేసిన గురజాడ నివసించిన గృహాన్ని సందర్శించడం ఒక గొప్ప అనుభూతిని కలిగించిందన్నారు. గురజాడ గృహంలో ఆయన చేసిన రచనలు, వాడిన పాత్రలు, వాటి నేపథ్యాలతో కూడిన చిత్ర పటాలు డాక్యుమెంటరీల రూపంలో కళ్లకు కట్టినట్లుగా దర్శనమివ్వడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం అధ్యాపకులు వీణ, దీప్తి, కోటేశ్వరరావు, ఇందిరా, ప్రసాద్ తదితరులు గౌరీనాయుడిని సత్కరించారు. కార్యక్రమంలో గురజాడ అభిమానులు, విద్యార్థులు పాల్గొన్నారు.


గురజాడ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గౌరీనాయుడు

ప్రజా సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్

- పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు
- గ్రీవెన్స్‌కు ఎనిమిది అర్జీలు


పీజీఆర్ఎస్‌లో అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రతివారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టమ్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి ఎనిమిది అర్జీలు అందినట్లు ఆర్డీఓ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చే ప్రతి అర్జీని పరిష్కరిస్తామన్నారు. డివిజన్ స్థాయిలో అన్ని శాఖల అధికారులు గ్రీవెన్స్‌కు హాజరయ్యేలా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. మండల స్థాయిలో తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గ్రీవెన్స్‌లో వచ్చే ప్రతీ అర్జీని పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత శాఖాధికారులపై ఉందన్నారు. ఈ వారం వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులను ఆర్డీఓ ఆదేశించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ బాలామణి, సీడీపీఓ ఉష, గృహ నిర్మాణశాఖ అధికారి రవిశంకర్, డీటీ భానుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఎంఈఓ తనిఖీలు

కొత్తపల్లి: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని మండల విద్యాశాఖాధికారి వేణుగోపాల్ అన్నారు. మండలంలో కొమరగిరి, కుతుకుడుమిల్లి జిల్లా పరిషత్ హైస్కూళ్లు, ఎంపీపీ పాఠశాలలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలకు బాల్య వివాహాలు చేయడం చట్టపరంగా నేరమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు, దుస్తులు అందిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఈ ఏడాది గణనీయంగా పెరిగిందని తెలిపారు.

వాటర్ ట్యాంకుల క్లీనింగ్ ప్రారంభం

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో వాటర్ ట్యాంకుల క్లీనింగ్ పనులు ప్రారంభించారు. స్థానిక గణపతినగరంలో ఉన్న రెండు వాటర్ ట్యాంకులను సోమవారం శుభ్రం చేసే పనులకు శ్రీకారం చుట్టారు. వేట్లపాలెం గ్రామంలో తాగునీటి కారణంగానే అతిసార వ్యాధి వ్యాపించిందనే సమాచారం మేరకు ట్యాంకులను శుభ్రం చేయిస్తున్నారు. ఈ మేరకు ఈ పనులను మున్సిపల్ కమిషనర్ జె.రామారావు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి నెలా మంచినీటి ట్యాంకులు శుభ్రం చేయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు ట్యాంకులు శుభ్రం చేయించిన తేదీలను నమోదు చేయిస్తున్నామని తెలిపారు. మంగళవారం కోట్లమ్మ చెరువు వద్ద ఉన్న రెండు ట్యాంకులను శుభ్రం చేయిస్తామని చెప్పారు. స్థానిక ఉండూరు రోడ్డులోని ఫిల్టరు ప్లాంట్ నుంచి పైపులైన్ల ద్వారా తాగునీటి ట్యాంకుల్లో నింపి ప్రజలకు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో ప్రతిఒక్కరూ తాగునీటిని వేడి చేసి, వడపోసి తాగాలన్నారు. కౌన్సిలర్ బలుసు వాసు, వాటర్ వర్క్స్ సిబ్బంది పాల్గొన్నారు.


సామర్లకోట గణపతినగరం వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న కమిషనర్


పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపండి


సామర్లకోట మున్సిపల్ కమిషనర్‌కు సమస్యలపై వినతి పత్రం అందజేసిన మానవ హక్కుల సంఘ నాయకులు

సామర్లకోట: పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉన్నదని మానవహక్కుల సంఘ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా మానవహక్కుల సంఘ అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ ఆధ్వర్యంలో సోమవారం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి వార్డులోనూ చెత్త పెరిగి పోయిందని, డ్రైన్లు పొంగి ప్రవహిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమీప ప్రాంతాల్లో అతిసార వ్యాధి వ్యాప్తి చెందుతున్న కారణంగా తాగునీరు, పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. నాగార్జున ఫిల్టరు చెరువులో చేపల వేట సాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయని, చేపల వేటను నిలుపుదల చేయించి స్వచ్ఛమైన తాగు నీరు అందించాలన్నారు. అదే విధంగా హోటల్స్, మిఠాయి దుకాణాల్లో తినుబండాలపై తనిఖీలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మానవహక్కుల సంఘ నాయకులు ఎస్.రెహమాన్ జుత్తుక అప్పారావు, కౌన్సిలర్ బలుసు వాసులు పాల్గొన్నారు.

చేపల వేటను నిలుపుదల చేయాలి

- వైస్ ఛైర్మన్, కౌన్సిలర్ల డిమాండ్
- కమిషనర్ దృష్టికి ఫిల్టర్ చెరువు దుస్థితి


చెరువులో చేపల వేటకు సిద్ధంగా ఉంచిన బోట్లు


కమిషనర్‌కు చెరువు పరిస్థితిని వివరిస్తున్న వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

సామర్లకోట: పట్టణ ప్రజలకు తాగు నీరందించే చెరువులో చేపల వేటను నిషేధించాలని వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తాగునీటి ఫిల్టర్ ప్లాంట్‌ను వారు పరిశీలించారు. ఫిల్టర్ ప్లాంట్‌లో నీరు శుద్ధి అవుతున్న విధానాన్ని పరిశీలించి, గోదావరి జలాలు నేరుగా ఫిల్టర్ బెడ్‌లోకి తరలించి శుద్ధి చేస్తున్న విషయాన్ని గమనించారు. దాంతో ఫిల్టర్ చెరువును పరిశీలించారు. నాగార్జున ఫిల్టర్ చెరువులో నీరు నాచు పట్టి ఉండడంతో పాటు, చెరువులో చేపల వేట సాగించడానికి పడవలు సిద్ధంగా ఉండటంతో కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ సమీపంలోని వేట్లపాలెం గ్రామంలో నీటి కారణంగానే డయేరియా వ్యాప్తి చెందగా, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడేలా చేపల వేట సాగించడం ఏమిటని వైస్ చైర్మన్ మోజెస్, కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, కాళ్ల లక్ష్మీనారాయణ, కరణం రాజ్‌కుమార్, స్వయంభూరపు వీరభద్రరావు, పాగా సురేష్ కుమార్, సేపెని సురేష్, చల్లపల్లి వెంకటసత్యనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఫిల్టర్ చెరువు వద్దకు రావాలని కమిషనర్ జె.రామారావుకు ఫోన్ చేశారు. అక్కడకు చేరుకున్న కమిషనర్ రామారావుకు చెరువు పరిస్థితిని వారు వివరించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని చెరువులో నీరు కలుషితం కావడంతో గోదావరి జలాలను నేరుగా ఫిల్టరు బెడ్‌కు పంపి శుద్ధి చేయిస్తున్నామన్నారు. ఫిల్టరు చెరువులో చేపల వేటను నిలుపుదల చేసి, చెరువులో నీటిని పూర్తిగా తొలగిస్తామని చెప్పారు. చెరువులో పూడికను తీయించాలని నాగార్జున ఫ్యాక్టరీ యాజమాన్యానికి లేఖ రాసినట్టు తెలిపారు. చెరువు గేటుకు సంబంధించిన తాళాలు బయట వ్యక్తుల వద్ద ఉండటంపై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాళాలను ఫిల్టరు బెడ్‌లో పని చేసే సిబ్బంది వద్దే ఉంచాలని కమిషనర్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గంగిరెడ్డి కృష్ణమూర్తి, వారా సుధాకర్, చిట్టుమాని శ్రీనివాసరావు, కరణం భాను, కానేటి అప్పారావు, రెడ్డి శ్రీనివాసు, పాలిక చంటిబాబులు పాల్గొన్నారు.

రైతులకు వరి విత్తనాల పంపిణీ


శంఖవరంలో రైతులకు విత్తనాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఏలేశ్వరం: ఖరీఫ్ సాగు చేసే రైతులు విత్తనాల్లో మొలకశాతం గుర్తించాలని మండల వ్యవసాయాధికారి బి.జ్యోతి సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతులకు సోమవారం వరివిత్తనాలు పంపిణీ చేశారు. మండలంలోని ఏలేశ్వరం, తిరుమాలి, పెద్దనాపల్లి, మర్రివీడు, జె.అన్నవరం, తూర్పు లక్ష్మీపురం, తదితర గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు వరివిత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు ప్రభుత్వం కేజీ విత్తనాలకు రూ.5 చొప్పున సబ్సిడీ అందిస్తోందన్నారు. రైతులు మొలక శాతం గుర్తించడంతో పాటు విత్తనశుద్ధి చేయాలని సూచించారు. టీడీపీ నాయకులు మూది నారాయణస్వామి, బోద చిరంజీవిరావు, పాండ్రింకి అప్పారావు, పలివెల శ్రీను, బెల్లాని శ్రీను, రైతులు పాల్గొన్నారు.

సబ్సిడీపై వరి విత్తనాల పంపిణీ

రౌతులపూడి: మండలంలో రైతులకు సోమవారం సబ్సిడీపై వరి విత్తనాలను పంపిణీ చేశారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో రైతులకు ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి విత్తనాలను అంజేసారు. ప్రభుత్వం సబ్సిడీపై అందించిన ఆర్‌జీఎల్ 2537, ఎంటీయూ–1064 రకాల వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఏఓ రెడ్డి ఈశ్వర్, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కర్‌రావు, టీడీపీ మండలాధ్యక్షుడు తమరాన సత్యనారాయణ, జట్ల రాజా, ఏఈఓ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో విత్తనాలు

శంఖవరం: రైతులకు అందుబాటులో విత్తనాలు ఉన్నాయని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ తెలిపారు. మండలంలోని కత్తిపూడి, నెల్లిపూడి, జి.కొత్తపల్లి గ్రామాల్లోని విత్తనాల విక్రయ కేంద్రాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఓ గాంధీ మాట్లాడుతూ మండలానికి ఆర్‌జీఎల్ వరి విత్తనాలు 30 కిలోల బస్తాలు 133 వచ్చాయన్నారు. ఒక్కో బస్తా రూ.1,104కి విక్రయించనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. టీడీపీ నేతలు పర్వత సురేష్, వెన్నా శివ, బద్ది రామారావు, కీర్తి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నివారణపై అవగాహన

గోకవరం: మనుషుల అక్రమ రవాణాను నిరోధించడం అందరి బాధ్యత అని కోరుకొండ ఐసీడీఎస్ సీడీపీఓ ఝాన్సీరాణి అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో సోమవారం ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనుషుల అక్రమ రవాణా ప్రపంచంలోనే అతిపెద్ద నేరమన్నారు. ప్రతిరోజు ఎంతో మంది అమ్మాయిలు, మహిళలు అక్రమ రవాణాకు గురతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ వరలక్ష్మి మాట్లాడుతూ మహిళల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా తమ సంస్థ గత 28 సంవత్సరాలుగా పోరాటం చేస్తోందన్నారు. ప్రస్తుతం యువత మొబైల్, ఇంటర్నెట్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్‌కు గురవుతున్నారన్నారు. అక్రమ రవాణాకు గురైతే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు కౌలు హక్కు గుర్తింపు కార్డులు

- మండలంలో 6,100 సీసీఆర్‌సీ కార్డుల లక్ష్యం
- తహసీల్దార్ శ్రీనివాసు


సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ సత్య

సామర్లకోట: మండల పరిధిలోని కౌలు రైతులకు 6,100 కౌలు రైతు హక్కు గుర్తింపు కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించిన్నట్టు తహసీల్దార్ వై.శ్రీనివాసు తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కౌలు రైతుల కార్డులపై జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి గ్రామంలోను వీఆర్వోలు, వీఏఏలు కలిసి గ్రామస్తులతో చర్చించి కౌలు రైతుల ను గుర్తించి కౌలు రైతు కార్డుల పంపిణీ చేయాలన్నారు. మండల వ్యవసాయ శాఖాధికారి ఐ.సత్య మాట్లాడుతూ కౌలు రైతు కార్డులు తీసుకున్న కౌలు రైతులకు పంటపై మాత్రమే హక్కు ఉంటుందని చెప్పారు. ఈ కార్డు ఆధారంగా బ్యాంకుల నుంచి రుణాలు పొందే అవకాశం ఉంటుందని, ఆ రుణాన్ని సకాలంలో చెల్లించాల్సిన బాధ్యత కౌలు రైతు పైనే ఉందన్నారు. కౌలు రైతు హక్కు కార్డు ఉన్నా భూమిపై ఎటువంటి హక్కు ఉండదని చెప్పారు. ప్రభుత్వ అన్ని పథకాలు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రీనివాసు, మండల వ్యవసాయ విస్తరణాధికారులు సతీష్, శాంతి కమల, వీఏఏలు, ఆర్వోలు పాల్గొన్నారు.